గ్రావెల్ వాహనాలు పట్టివేత

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం అరిణాం అక్కివలస జంక్షన్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ వాహనాలను గురువారం రాత్రి అధికారులు పట్టుకున్నారు. తహశీల్దార్ బి.గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం అరిణాం అక్కివలస గ్రామానికి సమీపంలో ఓ ప్రైవేటు స్థలాన్ని చదును చేసేందుకు ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పట్టుకున్నామన్నారు. జేసీబీ, టిప్పర్ను పట్టుకుని గనుల శాఖ అధికారులకు అప్పగించామన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ వి.సందీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్గో ఎయిర్ పోర్ట్ ప్రతిపాదనను రద్దు చేయాలి

బలవంతపు భూసేకరణను ఆపాలి
18న చేపట్టే మహా ధర్నాను విజయవంతం చేయాలి
కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపు

విశాలాంధ్ర - పలాస: పచ్చని ఉద్దాన ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన కార్గో ఎయిర్ పోర్ట్ ప్రతిపాదన రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని కోరుతూ నవంబర్ 18న పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద జరుగు మహా ధర్నాను జయప్రదం చేయాలని కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం స్థానిక కళ్యాణ మండపంలో పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవింద రావు, న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు. పోరాట కమిటీ కార్యదర్శి జోగి అప్పారావులు మాట్లాడుతూ కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో ప్రజల ఆస్తులను కార్పొరేట్ ఆస్తులుగా మార్చడమే అభివృద్ధా? అని కేంద్ర పౌర విమానాయా శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ప్రశ్నించారు. తుఫాన్ లో ప్రజలు బిక్కుబిక్కుమని బతుకుతుండగా మరో వైపున ప్రభుత్వ యంత్రాంగం రహస్యంగా సర్వేల కోసం గ్రామాలకు రావడాన్ని తీవ్రంగా ఖండించారు. శ్రీకాకుళం జిల్లాలో అసంపూర్తిగా మిగిలి ఉన్న ఆఫ్ షోర్ రిజర్వాయర్, జిల్లా కేంద్రంలో ఉన్న కోడి రామకృష్ణ ఇండోర్ స్టేడియం కోసం కనీసం 6 కోట్లు తెచ్చుకోలేని పాలకులు, జిల్లాలో రోడ్లు బాగు చేయలేని వాళ్ళు కిడ్నీ వ్యాధితో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోలేకపోయిన వాళ్లు, ఈరోజు జిల్లా అభివృద్ధి కోసం మాట్లాడ్డం హాస్యస్పదంగా ఉందని ఏద్దేవా చేశారు. కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో లక్షలాది చెట్లు నరికేయడం వల్ల పర్యావరణ పరంగా శ్రీకాకుళం జిల్లాకు పెనుముప్పు ఏర్పడదా అని ప్రశ్నించారు. కార్గో ఎయిర్ పోర్ట్ ప్రతిపాదన వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు ముద్దిలి రామారావు, యన్.గణపతి, కె.శ్రీనివాస్, యం.రామారావు, పి.దుర్యోధన, కె.బాలజీ రావు, టి.భాస్కరరావు, జి.బాలకృష్ణ, పి.కుసుమ, పోరాట కమిటీ నాయకులు బత్తిని లక్ష్మణరావు, లండ రామస్వామి, గుంటు లోకనాదం, సుంకర రాజు, జోగి శ్రీదేవి, బర్రి వినోద్, బర్రి జయలక్ష్మి, కొమర తేజ, నల్ల పరశురామ్, బడే సాంబమూర్తి, గుంటు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్ రోడ్డు ప్రమాదంలో జిల్లా వాసులకు గాయాలు

- స్పందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: తీర్థ యాత్రల నేపథ్యంలో వారణాశి నుండి అయోధ్య వెళ్తుండగా జాన్పూర్ దగ్గర లారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన శ్రీకాకుళం జిల్లా వాసుల పరిస్థితిపై తక్షణమే స్పందించి వారికి మెరుగైన వైద్యం అందేలా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవ చూపారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జాన్పూర్ జాతీయ రహదారి వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా పలాస, కోటబొమ్మాళి, బ్రాహ్మణతర్ల ప్రాంతాలకి చెందిన పదహారు మంది వాసులు గాయపడ్డారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తక్షణ చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి, జాన్పూర్ కలెక్టర్, వారణాశి అధికారులకు, సంబంధిత ఆసుపత్రి వైద్యులకు ఆదేశించారు. క్షతగాత్రులను సురక్షితంగా స్వస్థలాలకు తరలించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు.



నిరుపేద మహిళకు ఆర్థికసాయం

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి: కంచిలి మండలం ప్రధానపుట్టుగ గ్రామంలో నిరుపేదరికంతో బాధ పడుతున్న ఊర్మిళ బిసాయి అనే మహిళకు ఆ గ్రామానికి చెందిన మామాణికేశ్వరి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు 15వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. ఊర్మిళ బిసాయి గత కొన్నాళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతుంది. ఈ పరిస్థితుల్లో ఆమెకు సహాయం చేయడం పట్ల గ్రామ యువతను స్థానికులు అభినందించారు.

పంటలకు నష్టపరిహారం అందించాలి

విశాలాంధ్ర-వజ్రపు కొత్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను గుర్తించి వాటికి నష్టపరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.మోహన్‌రావు, మండల అధ్యక్ష కార్యదర్శులు కే.బాలాజీరావు, టి.భాస్కర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మండలం సీతాపురం బెండి,గల్లి, శివరాంపురం, నగరంపల్లి గ్రామాలలో పర్యటించి తుఫాన్ వలన కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పంట పొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన అనేక గ్రామాలలో వరి పంట నీట మునిగిందన్నారు. ప్రభుత్వం, అధికారులు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సింగారి విఙ్ఞేశ్వరరావు, తమ్మి నాన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: రాష్ట్రంలో నవంబరు 3 నుంచి ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ) సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, పర్మినెంట్ కార్మికులు తలపెట్టిన సమ్మెను మొంథా తుఫాన్ నేపథ్యంలో వాయిదా వేస్తున్నామని ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యుడు టి.తిరుపతిరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజులు తెలిపారు. నగర పాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావుకు తాత్కాలిక సమ్మె వాయిదా నోటీసును గురువారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో మున్సిపల్ కార్మికులు సమ్మెకు వెళ్తే పారిశుధ్యం లోపిస్తుందని, ప్రజారోగ్యంలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులది ప్రత్యేక పాత్ర అని, ఇటువంటి సమయంలో సమ్మె సరికాదని అన్నారు. అందుకు వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు అర్జీ మణి, ఆర్.గణేష్, అరుగుల గురుస్వామి, రామచంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చట్టం అమలులో నిర్లక్ష్యం సహించం: ఇన్‌చార్జి కలెక్టర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించమని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులు, వైద్య సిబ్బందిని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సమావేశంలో అడిగిన కీలక గణాంకాలు సమర్పించకపోవడంపై జిల్లా వైద్య ఆరోగ్యాధికారి కార్యాలయ సిబ్బందిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూలై నుంచి నమోదైన గర్భిణీలు, గర్భస్రావాల వివరాలను కలెక్టర్ సమీక్షించారు. ఎల్.ఎన్.పేట పీహెచ్‌సీలో గర్భస్రావాల శాతం 11, సారవకోట, బొంతు పీహెచ్ సీల్లో 10 శాతంగా నమోదైందని, జాతీయ సగటు కంటే ఇక్కడ అధికంగా ఉన్నట్లు తెలిపిన కలెక్టర్ ఆయా మండలాల్లో ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేయాలని, స్కానింగ్ కేంద్రాల తనిఖీలు కఠినతరం చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 130 స్కానింగ్ యంత్రాలు ఉండగా, వీటిలో 101 ప్రైవేట్, 29 ప్రభుత్వ కేంద్రాలుగా ఉన్నాయని అధికారులు వివరించారు. క్షేత్రస్థాయి నుంచి ఫాలో అప్ వైద్యం అందించేందుకు అన్ని స్థాయిల సిబ్బందిని ఆదేశించారు.

ఈ సమావేశానికి అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి అనిత, కమిటీ కన్వీనర్ డా. శ్రీకాంత్, డీ.ఐ.ఓ డా. రామదాస్, డీసీహె చ్ఎస్ డా. కళ్యాణ్ బాబు, రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథరావు, సామాజిక కార్యకర్త, ఎం. వెంక టస్వామి, డా. ధానేటి శ్రీధర్, బెజ్జిపురం యూత్ క్లబ్ నుంచి ప్రసాదరావు హాజరయ్యారు.



వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి సమిష్టి కృషి: ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం: వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి సమిష్టి కృషి చేయాలని పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు అన్నారు. గురువారం పాతపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధి కోసం చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు సమిష్టిగా కృషి చేయాలని రైతులు సౌకర్యవంతంగా తమ ఉత్పత్తులను విక్రయించుకునే విధంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. కొత్త గోడౌన్లు, తూకం యంత్రాలు, నీటి వసతులు, షెడ్ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, అధికారులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.



సిఎస్సీ మార్క్స్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

విశాలాంధ్ర - నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సిఎస్సీ మార్క్స్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల విద్యాశాఖాధికారి-1, ఉప్పాడ శాంతారావు అన్నారు. గురువారం స్థానిక ఎం.ఈ.ఓ కార్యాలయంలో ఆయన మండలంలోని ప్రభుత్వ పాఠశాలలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా ఎంఈవో, శాంతారావు మాట్లాడుతూ అపార్ట్ డేటా సకాలంలో పూర్తి చేయాలన్నారు. పదవ తరగతికి చెందిన నామినెల్ రోల్‌ను, క్యాడర్ స్ట్రెంత్ వివరాలు తెలియజేయాలని, వేకెన్సీ పొజిషన్ వివరాలు తెలియచేసి, క్లస్టర్ పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని తామరాపల్లి గ్రామంలో ఎం.పి.యు.పి పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సంధర్భంగా ఆయన మధ్యాహ్న భోజన పథకానికి చెందిన రికార్డులను పరిశీలించి, వంట ఏజెన్సీ మహిళలు వండిన ఆహారాన్ని రుచి చూసి, ఇంకా నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

నేడు సర్దార్-150 ఏక్తా దివస్ మార్చ్

విశాలాంధ్ర-నరసన్నపేట: భారతదేశ ఉక్కు మనిషి, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకల సందర్భంగా ఈనెల 31వ తేదీన శ్రీకాకుళంలో సర్దార్-150 ఏక్తా దివస్ మార్చ్ నిర్వహిస్తున్నామని, ఈ పాదయాత్రను విజయ వంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏక్తా దివస్ పాదయాత్ర, జిల్లా కో-ఆర్డినేటర్, చింతు పాపారావు అన్నారు. శ్రీకాకుళంలోని సూర్యమహల్ జంక్షన్ నుండి పాదయాత్ర ప్రారంభం అవుతుందని, ఈ పాదయాత్రలో కేంద్ర మంత్రి, శ్రీకాకుళం ఎం.పి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొంటారని, దేశ నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ ముఖ్యంగా యువత క్రియాశీలకంగా పాల్గొనేలా చేసేందుకే ఈ మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

నష్టపోయిన ప్రతీ బాధితుడిని ఆదుకోవాలి

- ప్రభుత్వ విప్ అశోక్

విశాలాంధ్ర-కవిటి: మొంథా తుఫాను కారణంగా గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు గురువారం తన క్యాంపు కార్యాలయం రామయ్య పుట్టుగలో కవిటి, ఇచ్ఛాపురం మండలాల తహసీల్దార్లు బెహరా మురళీ మోహనరావు, వెంకటేశ్వర రావులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా వ్యవసాయ, ఉద్యానపంటల నష్టం, గ్రామాల్లో ఇళ్లు కూలిపోవడం, ఇతర నష్టాలపై గ్రామాల్లో సర్వే నిర్వహించి నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎస్ డీటీ సంతోష్ కుమార్, మండల టీడీపీ అధ్యక్షులు పొందల కృష్ణారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, పీఏసీఎస్ అధ్యక్షులు బాసుదేవు ప్రధాన్, బి.సురేష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు సిమెంట్ రహదారులు

- ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ రవికుమార్



విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని పొందూరు ఆముదాలవలస గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రహ దారులు కాలవల నిర్మాణానికి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు విడుదల చేసి రహదారులు మెరుగుపడుచున్నామని ఎమ్మెల్యే పీయూసీ చైర్మన్ కూన రవి కుమార్ కార్యాలయం గురువారం పేర్కొన్నారు. పొందూరు మండలంలోని 35 గ్రామపంచాయతీలకు గాను 466.20 రూపాయలను మంజూరు చేశారు. అలాగే ఆముదాలవలస మండలంలోని గ్రామాల రహదారులను మెరుగుపరిచేందుకు 36 పనులు ప్రతిపాదించగా 625.74 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు ఆ ప్రకటనలో వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రహదారులతో పాటు కాలవల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

మృతి చెందిన పోలీసు కానిస్టేబుల్ కుటుంబానికి రూ.కోటి మంజూరు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: శ్రీకాకుళం జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీసు హెడ్ కానిస్టేబుల్ పి.జగదీష్ రావు గత జూన్ నెలలో టెక్కలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించగా, ఆయన కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద కల్పించిన వ్యక్తిగత ప్రమాద బీమా మేరకు ఒక రూ.కోటి రూపాయలు మంజూరు చేశారు. ఈ నగదు చెక్కును జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి మరణించిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు (కుమారునికి) శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమాజ భద్రత కోసం అహర్నిశలు కృషి చేస్తుంటారు అని, విధుల్లో ఉన్నప్పుడు లేదా డ్యూటీ సమయంలో సంభవించిన ప్రమాదాల్లో మేము వారి కుటుంబాలకు ఇటువంటి భీమా సేవలు బాధిత కుటుంబానికి అండగా ఉంటాయిని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కెవి రమణ, పి.శ్రీనివాసరావు, పోలీసు కార్యాలయం ఏవో గోపినాథ్, బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ గోవింద్ కుమార్ సింగ్, శాఖ మేనేజర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.



చేపలు వేట వలలో చిక్కుకొని మత్స్యకారుడు మృతి



విశాలాంధ్ర - సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ, సీతానగరం గ్రామానికి చెందిన బచ్చల భీమారావు (55) గురువారం ఉదయం తంపరలోకి చేపలు వేటకి వెళ్లి వలలో చిక్కుకొని మృతి చెందారు. తన కుమారుడు బచ్చల కోదండరావు తండ్రి ఇంతవరకు ఇంటికి రాలేదని ఎన్నిసార్లు ఫోన్ చేసిన స్పందించక పోవటంతో వెళ్లి చూసే సరికి వలలో చిక్కి మృతి చెంది ఉండటాన్ని గమనించారు. గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. నౌపడ పోలీస్‌స్టేషన్ రైటర్ ఊర్వారావు, రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో పంచానామా నిర్వహించారు. పోస్ట్ మార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఎంపీటీసీ బత్సల సుధాకర్ మత్స్య శాఖాధికారులకు సమాచారం అందించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఉయ్యాలపేటలో పంటపొలాల పరిశీలన

విశాలాంధ్ర-నందిగాం: మండలంలోని లింగాలపాడు, ఉయ్యాలపేట తదితర గ్రామాల్లోని పంట పొలాలను వ్యవసాయ శాఖాధికారులు గురువారం పరిశీలించారు. నేలకొరిగిన పంట పొలాలను పరిశీలించి నష్ట శాతాన్ని అంచనా వేస్తామని మండల వ్యవసాయాధికారి పి. శ్రీకాంత్ వర్మ పేర్కొన్నారు.



భారీ వర్షాలకు కూలిన ఇంటి గోడ

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం భైరిపురం గ్రామంలో మొంథా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు బొర్ర సుందరరావుకు సంబంధించిన ఇంటి గోడ కూలిపోయింది. దీంతో బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గురువారం సాయింత్రం రెవెన్యూ సిబంది వెళ్లి వారి వివరాను నమోదు చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. సీనియర్ టీడీపీ నాయకులు సీపాన వెంకటరమణ, కూటమి నాయకులు వారిని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగిని మృతి

విశాలాంధ్ర - కొత్తూరు: మండలం కడుమ సచివాలయంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న మాలతీ (48) గురువారం ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి తలకు బలమైన గాయం తగిలి ప్రమాదస్థలంలోనే మృతి చెందారు. మండలం సరిహద్దు ప్రాంతం ఒడిశాలోని కాశీనగరం నుండి విధులు నిర్వహించడానికి రోజు లాగే కడుమ గ్రామ సచివాలయానికి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో గొట్టభద్ర గ్రామం మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో మాలతీ కింద పడింది. ఆమె తల రోడ్డుకు తగిలి చెవి నుంచి రక్తస్రావం జరిగి సంఘటన స్థలంలోనే మృతిచెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మాలతి మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మాలతీ భర్తతో ఉన్న మనస్పర్ధల కారణంగా ఒడిశాలోని కాశీనగరంలో కన్నవారి ఇంటి నుంచి విధులకు హాజరవుతున్నట్టు మాలతి బంధువులు చెబుతున్నారు. అలాగే మృతురాలి కుమారుడు అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నట్టు బంధువులు చెబుతున్నారు.



నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ నీటి సంఘం అధ్యక్షులు సత్తారు వెంకటరమణ

విశాలాంధ్ర - టెక్కలి: మొంథా తుఫాన్ ధాటికి వ్యాపార వాణిజ్య కార్యకలాపాలతో పాటు రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, రైతులకు కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ నీటి సంఘం అధ్యక్షులు సత్తారు వెంకటరమణ పేర్కొన్నారు. భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు వలన వరి పనలు నేలకొరిగి రైతులు నష్టపోయారని అన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించలేక ఒక రకమైన నష్టం రైతులు చవి చూశారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రకృతి కూడా పగబట్టి రైతును నట్టేట ముంచిందిని అన్నారు. అయితే ప్రస్తుత పాలక ప్రభుత్వాలు తాజాగా మొంథా తుఫాన్ బాధితులుకి అండగా ఉంటామని ప్రకటించారు. గతంలో వచ్చిన తిత్లీ తుఫాన్ హుదూద్ తుఫాన్ బాధితులకు సహాయం చేస్తాం అని ఆనాడు చెప్పి, అప్పుడు దాతలు ద్వారా విరాళాలు సేకరించి, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన సహాయం, కేవలం టిడీపీ కార్యకర్తలు నాయకులు జేబులు నింపు కోవడం జరిగిందే తప్ప నష్టపోయిన రైతులకు గానీ, సామాన్య ప్రజలకు గాని నష్టపరిహారం అందలేదునీ మండిపడ్డారు. నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని, దళారులు లేకుండా రైతుల ఖాతాల్లోకి నేరుగా జమచేసి చిత్త శుద్ధి నిరూపించకోవాలన్నారు.

సముద్రపు నాచు సాగుతో మహిళలకు ఉపాధి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: సముద్రపు నాచు సాగుతో మత్స్యకార మహిళలకు ఉపాధి మెరుగుపడుతుందని వెలుగు డీపీఎం నారాయణరావు అన్నారు. మండలం బుడగట్లపాలెంలో స్వయం సంఘాల సభ్యులకు సముద్రపు నాచు సాగు, మార్కెటింగ్పై మూడు రోజుల పాటు నైపుణ్య శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రపు నాచు సాగుతో వ హిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మార్చేందుకు సెర్ఫ్ అమృత యూనివర్సిటీ (కేరళ) తో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఇందులో భాగంగా అమృత యూనివర్సిటీ రీసెర్స్ అసోసియేట్స్ మోహన్, అమృత నాచు సాగుకు ఉన్న స్థానిక పరిస్థితులు, సాగు విధానాన్ని పరిశీలించారు. ఈ కార్య క్రమంలో ఏపీఎం రత్నం, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కుమారి తదితరులు పాల్గొన్నారు.



నీట మునిగిన 'వరి' పంటకు నష్టపరిహారం అందించాలి

పోలాకి జెడ్పీటీసీ డా.ధర్మాన కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - జలుమూరు/నరసన్నపేట: మొంథా తుఫాన్‌కు నీటిలో మునిగిన వరి పంటకు కూటమి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని పోలాకి జెడ్పీటీసీ డా.ధర్మాన కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. గురువారం నియోజకవర్గంలోని జలుమూరు మండలంలో రాయిపాడు గ్రామంలో నీట మునిగిన వరి పంటను ఆయన పరిశీలించారు. అనంతరం కృష్ణ చైతన్య మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హాయాంలో రైతులు పండించే పంటలకు ఉచిత భీమా ఉండేదని, నేడు కూటమి ప్రభుత్వంలో పంటలకు ఉచిత భీమా తొలగించారని విమర్శించారు. ఈ కార్యక్ర మంలో జలుమూరు ఎంపిపి వాన గోపి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బగ్గు రామకృష్ణ, వైసిపి ప్రతినిధులు దామ మన్మధరావు, పైడి విఠల్‌రావు, బోర సింహాచలం, కన్నయ్య, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్‌సిటిసి అండమాన్ యాత్ర

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ మరియు టూరిజం కార్పొ రేషన్ లిమిటెడ్(భారత ప్రభుత్వ సంస్థ) అండమాన్ దీవులకు ప్రత్యేక విమానం ప్యాకేజీ ప్రకటించింది. విశాఖపట్నం నుంచి ఈ విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయని ఐఆర్‌సిటిసి చందన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌టిసి అండమాన్ ఎమరాల్డ్ ప్రయాణానికి నవంబర్ 20 నుంచి 25 వరకు ఉంటుందన్నారు. పోర్ట్ బ్లేర్, రాస్, నార్త్ టి ఐలాండ్ హావ్‌లాక్, నీల్ ఐలాండ్ ప్రదేశాల పర్యటన ఉంటుందన్నారు. ఒకరికి 67165 రూపాయలు ఉంటాయని, ఇరువురైతే 50670 రూపాయలు అవుతుందని, ముగ్గురు ప్రయాణికులు కుటుంబం అయితే 48,990 రూపాయలు ప్రయాణపు ఖర్చులు ఉంటాయని వివరించారు. ఎయిర్ లైన్స్‌లో ఎకానమీ క్లాస్ ఫ్లైట్ టికెట్స్ ఉంటాయన్నారు. ఎయిర్ లైన్స్ హోటల్ వసతులతో పాటు షేరింగ్ ప్రాతిపదికన ఏసి వాహనాల్లో ప్రయాణ ప్రణాళిక ప్రకారం సందర్శన స్థలాలు ఉంటాయి అన్నారు. 5 అల్పాహారాలు ఐదు విందులు స్థిరమైన మెనుతో ఉంటాయని వివరించారు. ప్రయాణబీమాతో పాటు టూర్ మేనేజర్ సేవలు ఉంటాయని తెలిపారు. నవంబర్ 20 నుంచి 25 వరకు అండమాన్ ప్రయాణాన్ని యాత్రికులు వినియోగించుకోవాలని కోరారు.

మహిళలతోనే పర్యావరణ పరిరక్షణ

విశాలాంధ్ర - కవిటి: కుటుంబ వ్యవస్థను చక్కదిద్దినట్లే పర్యావరణాన్ని చక్కదిద్దే బాధ్యత మహిళలకే ఉందని వ్యవసాయాధికారి పిరియా శ్రీదేవి, పాఠశాల ప్రబంధకారిణి బెందాళం పవిత్ర అన్నారు. గురువారం విద్యాభారతి ద్వారా నిర్ణయించిన అఖిల భారతీయ యోజన అనుసరించి పాఠశాల స్థాయిలో సప్తశక్తి సంఘం కార్యక్రమం కే.కొత్తూరు అర్ష విజ్ఞాన భారతి పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.



స్థాపితం : 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
[illegible]
కావాల్సిన ప్రాంతాలు :
కంచిలి, పాతపట్నం, జలుమూరు, సారవకోట, బూర్జ, పొందూరు, ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, గార, శ్రీకాకుళం కలెక్టరేట్, శ్రీకాకుళం రూరల్, శ్రీకాకుళం టౌన్.
సంప్రదించవలసిన వారు:
యస్.రమేష్, బ్యూరో చీఫ్, విశాలాంధ్ర, రామలక్ష్మణ జంక్షన్, శ్రీకాకుళం
సెల్: 7569642555

ప్రజలకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర-కవిటి: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని డెప్యూటీ ఎంపీడీవో వై వరప్రసాదరావు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని లండారిపుట్టుగ, సహలాలపుట్టుగ సచివాలయా లలో సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాను కారణంగా గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో ఇళ్లు కూలిపోవడం,పంట నష్టం ఇతర నష్టాలపై గ్రామాల్లో సర్వే నిర్వహించి నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. తుఫాను సందర్భంగా గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు నిర్వహించాలని కోరారు.విధి నిర్వాహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గాయత్రీ నగర్ కు నడకదారేది...?

ఏళ్ళు గడుస్తున్న నోచుకోని మౌలిక వసతులు..!

విశాలాంధ్ర-మందస: మందస మేజర్ పంచాయితీ పరిధిలో గల గాయత్రి నగర్ ఏర్పడి సుమారు 15 సంవత్సరాలు కావస్తోంది. అయినప్పటికీ ఈ కాలనీలో మౌలిక వసతుల కల్పన జరగలేదు.రహదారి,డ్రైనేజీ ల నిర్మాణాలు జరగక కాలనీ కంపు కొడుతుంది. వర్షం కురిస్తే అడుగు బయటకు వేయలేని దుస్థితి నెలకొనడంతో పాటు తీవ్ర దుర్వాసనతో స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు.వర్షాకాలం కావడంతో నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండడంతో దోమల బెడద వెంటాడుతోంది.దీంతో దోమ కాటు జ్వరాలైన మలేరియా,డెంగ్యూ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మరోవైపు రాత్రిపూట పాముల బెడద వెంటాడుతుంది.రోడ్డుపై గల నీటిలో పాములు సంచరిస్తుండడంతో నడిచి వెళ్లేందుకు కూడా ప్రజలు భయపడుతున్నారు.మరోవైపు పంచాయతీ అధికారులు పారిశుధ్యం పై దృష్టి పెట్టలేనిపరిస్థితులు నెలకొన్నాయి.అసలు మేజర్ పంచాయతీలో గాయత్రి నగర్ అనే ఒక కాలనీ ఉన్న విషయం అధికారులకు తెలుసో లేదో..? అని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు.స్థానిక సమస్యలపై గతంలో పలుమార్లు స్పందనలో మండల అధికారులకు వినతి పత్రాలు అందజేసినప్పటికీ ఫలితం శూన్యం అని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నులు చెల్లిస్తున్నప్పటికీ తమ గోడును పంచాయతీ అధికారులు గాని, మండల అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యలను అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్తున్న సమయంలో గాయత్రి నగర్ రియల్ ఎస్టేట్ వెంచర్లని, అందుకే అభివృద్ధికి నోచుకోవడం లేదని బదులిస్తుండడం శోచనీయం. గాయత్రి నగర్ ఏర్పడిసుమారు 15 సంవత్సరములు కావస్తున్న మౌలిక వసతులకు నోచుకోకపోవడం ఒకవైపు ఆందోళన కలిగిస్తున్న విషయం అయితే, మరోవైపు గతంలో కొత్త వెంచర్లు పంచాయతీలో ఇష్టానుసారం పుట్టుకు రావడం గమనార్హం.ఎన్నికల సమయంలో ప్రచారం కోసం కనిపిస్తున్న ప్రజా ప్రతినిధులు, అనంతరం ఇటువైపు తొంగి చూడని పరిస్థితులు నెలకొన్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మందస మేజర్ పంచాయతీ పరిధిలో గల గాయత్రీ నగర్ మౌలిక వసతుల సమస్యలకు పరిష్కారం దక్కుతుందో.. లేదో అని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కనీసం కూటమి ప్రభుత్వ పాలనలోనైనా గాయత్రీ నగర్ కు మౌలిక వసతుల కల్పన జరుగుతుందని పలువురు స్థానికులు భావిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష సమస్యపై దృష్టి సారించి గాయత్రీ నగర్ రహదారికు మోక్షం కల్పించాలని పలువురు స్థానికులు వేడుకుంటున్నారు.

రక్త దాతలే ప్రాణదాతలు..

- పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలి
- రక్తదానం ఒక మానవతా సేవ కార్యక్రమం
- ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జిల్లాలో కొనసాగుతున్న అమరవీరుల స్మారక ఉత్సవాలలో భాగంగా, శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, హాజరై, మెడికల్ క్యాంపు రక్తదాన శిబిరాన్ని లాంఛనప్రాయంగా ప్రారంభించారు. ఈ క్రమంలో ముందుగా బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి రక్త దానం చేసి సిబ్బందిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "అమరవీరుల స్మారక ఉత్సవాల భాగంగా పోలీసు సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ఈ మెగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నాం.పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవి, ఒత్తిడితో కూడుకున్నవి కావున ప్రతి సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం అత్యవసరం," అని అన్నారు.రక్తదానం ఒక మానవతా సేవ.మన రక్తం మరొకరి ప్రాణాన్ని రక్షించగలదు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒకసారి రక్తదానం చేసి సమాజంలో సేవా స్ఫూర్తిని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, మహిళ పోలీసులు పాల్గొని రక్తదానం చేశారు.మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో వైద్య బృందం ద్వారా రక్తపోటు, షుగర్, కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడ్డాయి.రెడ్ క్రాస్ జిల్లా ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం విజయవంతంగా సాగింది.రక్తదానం చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి, రెడ్ క్రాస్ వారి ప్రశంస, పతకాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో భాగంగా జిల్లా పోలీస్ మెడికల్ యూనిట్, రెడ్ క్రాస్ సమితి, మెడికవర్ హాస్పిటల్ వైద్య బృందాలకు ఎస్పీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కెవి రమణ, పి శ్రీనివాసరావు డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, శేషాద్రి, రెడ్ క్రాస్ ఛైర్మెన్ జగన్మోహన్, పోలీసు యూనిట్ డాక్టర్ పోలీసు యూనిట్ డాక్టర్ సి హెచ్ విజయ కుమార్, పలువురు వైద్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది, మహిళ పోలీసులు, హెూంగార్డులు, పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా 'బగ్గు అర్చన' జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-నరసన్నపేట: నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి కుమార్తె, నరసన్నపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్, బగ్గు అర్చన జన్మదిన వేడుకలు గురువారం టిడిపి శ్రేణులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా నరసన్నపేట టిడిపి కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్ళు పంపిణీ చేసి, గొట్టిపల్లి పంచాయితీ పరిధిలో ఉన్న వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సంధర్భంగా అర్చన మాట్లాడుతూ నా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన టిడిపి కార్యకర్తలు, నాయకులకు, మహిళలకు హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియచేశారు. నియోజకవర్గ ప్రజానీకానికి ఎల్లప్పుడూ నేను అందుబాటులో ఉంటానని, ప్రతీ ఒక్కరి కష్టసుఖాల్లో వెన్నంటే ఉంటానని తెలిపారు. నాన్నగారి అడుగుజాడల్లో నడుచుకుంటూ, నియోజకవర్గ ప్రజానీకానికి నిస్వార్ధమైన సేవలందిస్తానని అర్చన అన్నారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు, మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, టిడిపి నాయకులు, గొద్దు చిట్టిబాబు, శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, బోయిన సతీష్, సకలాభక్తుల గోవిందరావు, సాసుపల్లి మధుసూధనరావు, పూణ్ణ రాజశ్రీ వేంకటేశ్వరరావు, బతకల సంతోషి, అడపా చంద్రశేఖర్, శిమ్మ లక్ష్మణరావు, బలగ ప్రహర్షకుమార్, పుచ్చల కల్పన, నేతింటి విశ్వేశ్వరరావు, పూణ్ణ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పడిపోయిన వరిచేనును పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలోని కరగాం పంచాయితీ నర్సింగపల్లి గ్రామంలో మొంథా తుఫాన్ ధాటికి నేలపై పడిపోయిన వరి పంటను రాగోలు, ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రంకు చెందిన శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. ఈ సంధర్భంగా శాస్త్రవేత్తలు, కె.భాగ్యలక్ష్మి, పి.ఉదయ్‌బాబు మాట్లాడుతూ తీవ్రమైన ఈదురు గాలులకు వరి పంట పడిపోయిందని, నీటి ప్రవాహం తగ్గిన తర్వాత వరి పంట కోలుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరగాం పంచాయితీ సర్పంచ్, వంగ బావాజీనాయుడు, వ్యవసాయశాఖ ఏ.డి, ఎల్.వి.మధు, ఏ.ఓ, వై.సూర్యకుమారి, కరగాం రైతు సేవా కేంద్రం అధికారి, అనంతరావు, రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత వ్యక్తిత్వం, ఉత్తమ భవిష్యత్తుకు పునాది

విశాలాంధ్ర-సోంపేట: విద్యార్థి దశ నుంచి ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన విద్యార్థులు ఉత్తమ భవిష్యత్తుకు పునాది వేసుకోగలరని ప్రముఖ మనో వికాస నిపుణులు, జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబుడ్డి గణపతి అన్నారు. ఈ మండలం కొర్లాం గ్రామానికి చెందిన గణపతి గురువారం పశ్చిమబెంగాల్ ఖరగ్‌పూర్‌లో ఆంధ్రా విద్యాలయంలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు జీవిత పాఠం, జీవన నైపుణ్యాలు అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో కష్టాలు, సుఖాలు, వెలుగు, చీకటి ఉంటుందని అన్నారు. చీకటి లేని ప్రపంచం కోరుకుంటే మనం కూడా చీకట్లోనే మిగిలిపోతామని అన్నారు. జీవితంలో సంభవించే పరిణామాలు సానుకూల దృక్పధంతో స్వీకరించాలని కోరారు. అటువంటి కష్టాలు, సుఖాలుజీవితంలో సమానంగా స్వీకరించిన వాళ్లు మహాత్ములయ్యారని, అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని మనం కూడా జీవితాలను కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు డాక్టర్ కర్రి తారకేశ్వరరావు, కె.వి.సుబ్రహ్మణ్యం, గౌరకల ఢిల్లేశ్వరరావు, శంకరరావు, గౌరంగపతి, కనకరాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కవిటి: జుత్తు జగ్గన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు విశాఖపట్నం వారు 10వ తరగతి విద్యార్థులకు అందజేస్తున్న స్టడీ మెటీరియల్ను సద్వినియోగం చేసుకోవాలని ఆ ట్రస్ట్ అధ్యక్షులు జుత్తు సింహాచలం, అన్నారు. జిల్లాలో 20 మండలాలకు రూ. 8 లక్షలు విలువ చేసే 3,500 సెట్లు (ఒక్కో సెట్టులో 7 (పుస్తకాలు) పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం కవిటి మండలంలోని 10వ తరగతి విద్యార్థులకు 223 సెట్లు ఇంగ్లీష్, 60 ఒరియా మీడియం సెట్లు, ఇంగిష్ ప్రశ్నపత్రాలు, గ్రామర్ పుస్తకాలు అందించారు.ముందుగా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందించారు.అనంతరం అన్ని పాఠశాలలకు అందజేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎంఈఓలు ధనుంజయ మజ్జి, సనపల రామకృష్ణులు మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ చదివి అత్యధిక మార్కులు సాధించి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి నడకే దివ్యఔషధం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఆరోగ్య భారత్ ఆవిష్కరణలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని, నడకే దివ్యఔషధం అని గ్రహించి ప్రతీ ఒక్కరూ విధిగా ఆయా ప్రాంతాల్లో ఉన్న వాకర్స్ క్లబ్స్ లో చేరాలని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు లు పిలుపు నిచ్చారు. గురువారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మరియు వాకర్స్ సంస్థల స్థాపకులు మాజీ మంత్రి సుంకరి ఆళ్వార్ దాస్ 95 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్టార్ వాకర్స్ క్లబ్ కో ఆర్డినేటర్ ఎస్. జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇటీవల వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన పీజీ గుప్తా మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం విశాఖ నగరంలో ప్రారంభమైన వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నేడు దేశవ్యాప్తంగా 1690 క్లబ్స్ గా విస్తరించి ఐదు లక్షల మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. కేవలం వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణ కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు.. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు గేదెల ఇందిరాప్రసాద్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి భరోసా ఇచ్చే ఏకైక సంస్థ వాకర్స్ క్లబ్స్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని విషయాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ నడండి.. నడిచి ఆరోగ్యం పొందండి అని అన్నారు.. ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఆవిష్కరించే దిశగా వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ మహిళా క్లబ్ అధ్యక్షరాలు గేదెల లక్ష్మీ, డిప్యూటీ గవర్నర్ పూన్న నాగభూషణం, ఎం. మల్లిబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కవిటి విద్యార్థులు

విశాలాంధ్ర-కవిటి: ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయస్థాయి కళా ఉత్సవ పోటీలలో భాగంగా విజయవాడ మురళి రిసార్ట్స్ నందు అక్టోబర్ 23, 24 తేదీలలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల అఖిల్,కోళ్ల వికాస్ లు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయిలో పాల్గొని ఇండీజీనియస్ టాయ్స్ విభాగం లో ప్రథమ స్థానాన్ని పొంది జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నెయ్యిల విశ్వనాథం విద్యార్థులను అభినందిస్తూ..ప్రతిభను కొనియాడారు.జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చూపి పాఠశాలకు, మన జిల్లాకు తద్వారా మన రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయులు యు.గిరిబాబు, పీబికే శర్మలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ తెప్పల మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లావణ్య మృత దేహం లభ్యం

విశాలాంధ్ర-పలాస: మండలం కంబిరిగాం వరహాల గెడ్డలో గల్లంతు అయిన దానగోర గ్రామానికి చెందిన సవర లావణ్య(35) మృత దేహం బ్రాహ్మణతర్ల వంతెన వద్ద గురువారం లభ్యమైంది. చాపలు పట్టేందుకు గడ్డలో దిగిన మృతుడు లావణ్య గల్లంతయి రెండు రోజుల కావస్తున్న మృత దేహం లభ్యం కాకపోవడంతో దానగోర గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కంబిరిగాం నుంచి బ్రాహ్మణతర్ల మధ్యలో వరహాల గెడ్డలో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నా సమయంలో బ్రాహ్మణతర్ల గ్రామానికి చెందిన స్థానికులు ఇనుప పైపులైన్ కు అడ్డుకొని మృత దేహం ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని కాశీబుగ్గ పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చిన మృతుడు బంధువులు వరద నీటిలో దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు వాస్తవానికి మెళియాపుట్టి మండలం దాసుపురం కాగా దానగోర గ్రామానికి చెందిన అన్నమ్మతో వివాహం జరగడంతో దాసుపురం నుంచి దానగోర గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ప్రస్తుతం ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. మృతుడుకు బార్య అన్నమ్మ, దానగోర గ్రామంలో కుమార్తె రశ్మిత ఐదో తరగతి చదువుతుండగా కుమారుడు టెక్కలి ఎస్టీ వసతి గృహంలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు.

మొంథా తుఫాను బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-తఎచ్చెర్ల: మండలంలోని డి. మత్స్యలేశం గ్రామంలోని మొంథా తుఫాన్కు సంబంధించి 53 మంది బాధితులకు ప్రభుత్వం తరపున రూ.1,000 వంతున ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం ఆర్థికసాయం అంజేశారు. అలాగే ఈ కుటు ంబాలకు 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను ఒకటి, రెండు రోజులుల్లో అందజేస్తామన్నారు. డి.మత్స్యలేశం, బడివా నిపేట, బుడగట్లపాలెం తదితర గ్రామాలకు చెందిన మత్స్యకార కుటుంబాలకు అదనంగా రేషన్ సరుకులను పంపిణీచేస్తావ అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మం డల టీడీపీ అధ్యక్షుడు బెందు మల్లేశ్వరరావు, తహసీల్దార్ బి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వారణాసిలో బ్రాహ్మణతర్ల వాసులకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-పలాస: పలాస మండలం బ్రాహ్మణతర్ల గ్రామానికి చెందిన పట్నాన వజ్రం మూర్తి, రమాదేవిలకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. వారణాసి నుంచి అయోధ్య పుణ్య క్షేత్రాలు దర్శించేందుకు కోటబొమ్మాళి ప్రాంతానికి చెందిన సుమారు 16 మందితో కలిసి ట్రావెల్ వాహనంలో ప్రయాణం చేస్తుండగా ట్రావెల్ వాహనానికి లారీ ఢీ కొట్టింది. అందులో ఉన్న పట్నాన వజ్రంమూర్తికు తల పై తీవ్ర గాయాలు కాగా బార్యకు చెయ్యి విరిగిపోయింది. బార్య భర్తలు ఈనెల 18 వ తేదీన పలాస నుంచి వారణాసి రైలులో ప్రయాణం చేశారు. వారణాసిలో నివాసం ఉంటూ ప్రతీ రోజు గయా, ప్రయాగ, కాలభైరవ, అలహాబాద్ తదితర ప్రాంతాలను సందర్శించారు. వారణాసి నుంచి అయోధ్య వెళ్ళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇది ఇలా ఉండగా ప్రమాద వార్త తెలుసుకున్న జిల్లా ఎంపీ కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తక్షణమే స్పందిస్తూ కోటబొమ్మాలి కి చెందిన క్షతగాత్రులకు ప్రభుత్వపరంగా తక్షణమే వైద్యశాయం అందించి ఏర్పాట్లు చేశారు.

సాగు చేస్తున్న గిరిజనులకు సాగు పట్టాలివ్వండి

-మందస తహశీల్దార్ కు వినతి పత్రం

విశాలాంధ్ర-మందస: మండలం కొండల్లోగాం రెవెన్యూ పరిదిలో చాపరాయి కోలనీలో గల గిరిజనులకు, గిరిజనేతరలకు మధ్య గల భూ వివాదం రోజు రోజుకు తీవ్రతరం కావస్తుందని తక్షణమే సాగు చేస్తున్న గిరిజనులకు సాగు పట్టాలు అందజేయాలని వామపక్ష ప్రజాసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మందస తహసిల్దార్ మిస్కా శ్రీకాంత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరరాలుగా గిరిజన ఆదివాసీలు సాగు చేసుకుంటున్నా జిరాయితీ,డి పట్టా భూములలో రీ సర్వేల పేరుతో గిరిజనేతరులు పేర్లు నమోదు కావటం పట్ల గిరిజనులు ఆందోళనకు గురౌవుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు ప్రధానంగా మందస తహశీల్దార్ జోక్యం చేసుకొని మరొక సారి సమగ్ర సర్వే చేసి సాగుబడిలో ఉన్న గిరిజనులకు శాశ్వత ప్రాతిపదికన పట్టాలిప్పించ వల్సిందిగా కోరారు. దీనిపై తహసిల్దార్ మిస్కా శ్రీకాంత్ స్పందిస్తూ 5న సమావేశం ఏర్పాటు చేసి ఇరు వర్గాల వాదనలు తెలుసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వామ పక్ష ,ప్రజా సంఘాల నాయకులు,గిరిజన సంఘాలు,రైతు సంఘాల నాయకులు కోనారి.మోహనరావు,తామాడ సన్యాసిరావు,కోనేరు రమేష్ ,మద్దిల రామారావు,సవర నర్సింహులు ,సవర మాదవరావు,జయరాజ్,సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవ పోటీలు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: మండలం గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పూండి(ఆర్ఎస్)లో ఘనంగా మండల స్థాయి యువజనోత్సవ పోటీలు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్ తెలిపారు.గురువారం కళాశాలలో గోవిదంపురం జూనియర్ కళాశాల, వజ్రపుకొత్తూరు ప్లస్ టూ కళాశాల, సాయి వినీత్ కళాశాల విద్యార్థులకు జానపద నృత్యం,జానపద పాటలు,ప్రసంగం, పెయింటింగ్ లపై వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించికొని ప్రభుత్వం జాతీయ యువజనోత్సవంను వచ్చే సంవత్సరం జనవరి 12న న్యూడిల్లీలో నిర్వహిస్తారని అన్నారు.జిల్లా స్థాయిలో మొదటి బహుమతి పొందిన వారికి,రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి పొందిన వారికి జాతీయ యువజనోత్సవంలో పాల్గొంటారని అన్నారు.ఈ యువజనోత్సవాలను ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభిస్తారని అన్నారు.మండల స్థాయిలో నిర్వహించిన పోటీలను విద్యార్థులకు ఎంపిక చేసి జిల్లాస్థాయిలో పంపించడం జరుగుతుందని అన్నారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేశవరావు, ఎన్ఎస్ఎస్ పీవో రూపసుందర్, అధ్యాపకులు జానీ,రాంబాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యతో సాంకేతిక అవగాహన సొంతం

- వృత్తి విద్యా శిక్షకురాలు నవ్య

విశాలాంధ్ర-కవిటి: ఒకేషనల్ విద్యతో సాంకేతిక అవగాహన సొంతమవుతుందని వృత్తి విద్యా శిక్షకురాలు నవ్య అన్నారు. ఈ సందర్భంగా రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఇండస్ట్రియల్ విజిట్లో భాగంగా కవిటి ఎస్విజె విద్యా సంస్థలలో ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్వేర్ ట్రేడ్ పై అవగాహన కలిగించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు శివరాం ప్రసాద్ పాడి మాట్లాడుతూ తరగతి గదుల్లో నేర్చుకున్న విషయాలను పరిశ్రమలలో వాస్తవంగా ఎలా ఉపయోగిస్తున్నారో చూడటం ద్వారా ఆచరణాత్మక జ్ఞానాన్ని సంపాదించవచ్చుని ఈ దిశగా విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి జె విద్యాసంస్థల మేనేజ్మెంట్ బివివి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దంపతులు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం పొందూరు పుట్టుగ గ్రామంలో తండ్రి కొడుకులు దూగాన రామ్మూర్తి, ప్రణయ్లు ఈనెల 16న రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైనారు. ప్రణయ్ ఇప్పటికే ఇంటికి చేరుకోగా తండ్రి రామ్మూర్తి ఆరోగ్య పరిస్థితి ఇంకను విషమంగానే ఉందని దీంతో గ్రామానికి చెందిన ఉపాధ్యాయలు ఉమాపతి నిర్మల దంపతులు వారి స్నేహితులు, సహెూపాధ్యాయులు,ఉపాధ్యాయులు,విద్యార్థుల నుంచి సేకరించిన రూ.35 వేలు ఆ కుటుంబానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు, శ్రీ కళ్యాణి జూనియర్ కళాశాల అధ్యాపకులు దాలయ్య మాస్టర్, కిరణ్ కుమార్, ఉమాపతి, పంచాయతీ కార్యదర్శి నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన కానిస్టేబుల్ డిల్లేశ్వరరావు

విశాలాంధ్ర-మందస: పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో, జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మందస పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కె.డిల్లేశ్వరరావు రక్తదానం చేశారు. శ్రీకాకుళం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల బ్లడ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో భారీ ఎత్తున పోలీసులు రక్తదానం చేశారు. ప్రజల రక్షణ కోసం సమయాన్ని, శక్తిని వినియోగిస్తున్న పోలీసులు ఇలాంటి సేవా కార్యకలాపాల్లోనూ ముందుగా నిలుస్తుండటం అభినందనీయమని ప్రజలు పేర్కొన్నారు.

విశాలాంధ్ర ▸ శ్రీకాకుళం
పేజి : 3
శుక్రవారం 31, అక్టోబర్ 2025

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో
మాజీ మంత్రి డాక్టర్ సీదిరి పర్యటన

విశాలాంధ్ర-పలాస: మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో పలాస మండలంలోని సున్నాడ, శాసనం, రాజగోపాలపురం గ్రామాల్లో పంటలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి. ఈ ప్రభావిత ప్రాంతాలను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం పర్యటించారు. శాసనం వద్ద జాతీయ రహదారి నుండి రాజగోపాలపురం వరకు నిర్మించిన కొత్త బీటీ రహదారిపై నీరు మళ్లించే ప్రాంతాల్లో చిన్న గొట్టాలు మాత్రమే ఏర్పాటు చేయడంతో ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వరద నీరు సక్రమంగా పారిపోకపోవడం వల్ల నీరు నిల్వ అయింది. ఫలితంగా శాసనం గ్రామంలో సుమారు 20 ఎకరాలు, సున్నాడలో 20 ఎకరాలు, అలాగే రాజగోపాలపురం పరిసర ప్రాంతాల్లో వందలాది ఎకరాల వ్యవసాయ భూములు ముంపుకు గురై, పంటలు నష్టపోయాయి.ఈ పరిస్థితిని స్వయంగా పరిశీలించిన డాక్టర్ సీదిరి అప్పలరాజు నష్టపోయిన రైతులకు తక్షణ నష్టపరిహారం చెల్లించడంతో పాటు సబ్సిడీపై విత్తనాలను వెంటనే అందించాలిందిగా సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దువ్వాడ రవి,రాష్ట్ర బూత్ కమ్యూనిటీ జాయింట్ సెక్రెటరీ చింతడ మాధవరావు. జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, మాజీ ఎంపీపీ,జిల్లా కార్యదర్శి బత్తిని హేమేశ్వరరావు, ముకుంద, సున్నాడ గ్రామస్తులు, శాసనం గ్రామస్తులు ,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి దుబ్బులను కట్టలు కట్టండి

- రైతులకు శాస్త్రవేత్తలుసూచన

విశాలాంధ్ర-ఆమదాలవలస: మొంథా తుఫాను సమయంలో కురిసిన భారీ వర్షాల వల్ల వరి, మొక్కజొన్న కూరగాయలు వంటి పంటలు నష్టపోయే అవకాశం ఉందని అందుకు తగిన జాగ్రత్తలు రైతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు జి.చిట్టిబాబు జి.ఎస్. రాయ్, జ్యోతి బస్, హరికుమార్ అన్నారు. రావికంటిపేట, కోర్లకోట, చీమలవలస, కలివరం, దూసి గ్రామాల్లో పంటలను గురువారం పరిశీలించారు. సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట పాలుపోసుకునే దశ నుండి గింజ గట్టిబడే దశలో ఉందని, ఈ దశలో చేను పడిపోతే రెండు మూడు దుబ్బులు కలిపి నిలబెట్టి కడితే కొంత నష్టం తగ్గుతుందని తెలిపారు. అలాగే 10 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని సూచించారు. పూర్తిగా కోత దశకు చేరుకున్న పంటపై 5శాతం ఉప్పు ద్రావణం (లీటర్ నీట కి 50 గ్రాములు ఉప్పు) పిచికారి చేయడం వల్ల గింజలు మొలకెత్త వని సూచించారు. బయటికి వెళ్లే విధంగా చూడాలని రైతులకు తెలిపారు. కూరగాయల పంటలను పరిశీలించి రైతులకు సూచనలు అందించా రు. నారుమడుల్లో నీరు నిలబడకుండా ఉండేటట్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మొక్కలు కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీ క్లోరైడ్ మూడు గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు.

బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- ఇన్చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఇన్చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణ చర్యలపై సమీక్ష నిర్వహించిన ఆయన, రోగులు, సిబ్బంది, ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా వ్యర్థాలను సక్రమంగా వేరు చేసి శాస్త్రీయ పద్ధతిలో నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రులు రెడ్, ఎల్లో, బ్లూ, వైట్ రంగుల కోడింగ్ బ్యాగులు ఉపయోగించి ఇంజక్షన్ సూదులు, పత్తి, గ్లౌవ్స్, శరీర వ్యర్థాలు వంటి బయోమెడికల్ వ్యర్థాలను తప్పనిసరిగా వేరు చేయాలని సూచించారు. ముఖ్యంగా, కాలం చెల్లిన మందులను సాధారణ చెత్తతో కలిపి పారబోయడం వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. అంతేకాక, ప్రతి ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్ తమ వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాల వివరాలను బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ యాప్లో ప్రతిరోజూ తప్పనిసరిగా ఎంట్రీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డేటా ఎంట్రీ చేయని సంస్థలపై కాలుష్య నియంత్రణ మండలి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 'చెత్తను వేరు చేసే ముందు ఆలోచించండి' అనే గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సమీక్షా సమావేశంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. కరుణశ్రీ, డిఎంహెచ్వో అనిత, డి సి హెచ్ ఎస్ డా. కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్‌కు తట్టుకున్న 'ప్రకృతి' వరి వ్యవసాయం

విశాలాంధ్ర-జలుమూరు/నరసన్నపేట: మొంథా తుఫాన్‌కు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నాటిన వరి పంట తట్టుకొని, నేలపై పడకుండా ఉందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, పూజారి సత్యన్నారాయణ అన్నారు. గురువారం నియోజకవర్గంలోని జలుమూరు, సారవకోట మండలాల్లో ప్రకృతి వ్యవసాయం పండిస్తున్న వరి పంటలను ఉత్తర కోస్తా రీజనల్ టెక్నికల్ టీం ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా యలమంచిలి, జగ్గయ్యపేట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులను వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేసిన వరి పంట తీవ్రమైన ఈదురు గాలులకు పడిపోకుండా నిలబడిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో వరి వేరు వ్యవస్థ సక్రమంగా వృద్ధి చెందటం వలన వరి మొక్కలు భారీ గాలులకు పడలేదన్నారు. ఇప్పటికైనా రైతులందరూ ప్రకృతి వ్యవసాయం పట్ల ఆకర్షితులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తర కోస్తా రీజనల్ టెక్నికల్ టీం ప్రతినిధులు, కె.ప్రకాష్, హేమసుందర్, జిల్లా ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, ఎన్.ఎఫ్.ఎ గోవిందరెడ్డి, మాస్టర్ ట్రైనీ, తోట రమణ, మెంటర్, రమణమ్మ, మోడల్ మేకర్, జగదీశ్వరరావు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

విశాలాంధ్ర-పలాస: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పలాస శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సందర్భంగా పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 'విజిలెన్స్- మనందరి సంయుక్త బాధ్యత' అనే అంశంపై జరిగిన ఈ పోటీలలో నలుగురు విజేతలకు త్వరలోనే బహుమతులను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, పవర్ గ్రిడ్ చీఫ్ మేనేజర్ వివిఎన్ఆర్ కేవన్ శెట్టి, జూనియర్ ఇంజనీర్లు కే.రఘుపతిరావు, ఈ. అప్పలనాయుడు, అధ్యాపకులు కొండల మధుబాబు, బి.ప్రసాదరావు, ఎస్. యుగంధర్, టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు

విశాలాంధ్ర-పలాస: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. గురువారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల మెప్మా కార్యాలయములో అంగీకార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంను చైర్మన్ బల్ల గిరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యపరంగా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిబిరంలో పాల్గొన్న 500 మంది రోగులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సి ఎల్ టి సి మల్లేశ్వరరావు,జగన్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ఐ అప్పన్న ఆకస్మిక మృతి

విశాలాంధ్ర మెళియాపుట్టి: మెళియాపుట్టి పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న బగాది అప్పన్న గురువారం నాడు ఆకస్మికంగా మృతి చెందారు. దీనికి సంబంధించి వివరాల ప్రాప్తికి గురువారం మధ్యాహ్నం ఒరిస్సా రాష్ట్రం మంత్రి పర్యటనకు రావడంతో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతమైన మెళియాపుట్టిలో మధ్యాహ్నం వరకు ఏఎస్ఐ అప్పన్న విధులు నిర్వహించారని అనంతరం చాపరలో నివాసం ఉంటున్న అయన ఇంటికి చేరుకున్నారని అప్పటికే వారి కుటుంబ సభ్యులు శ్రీకాకుళం వెళ్లడంతో ఏఎస్ఐ అప్పన్న ఒక్కరే ఇంట్లో ఉన్న ఆయాసమయంలో అస్వస్థతకు గురయ్యారని ఇంతలోనే తోటి సిబ్బంది ఫోన్ చేసిన సమయానికి ఏఎస్ఐ అప్పన్న సరిగ్గా మాటలాడలేని స్వరంతో డాక్టర్ను తీసుకురాని అనడంతో వెంటనే ఏఎస్సై రమణ ఓఆర్ఎంపి వైద్యున్ని తీసుకెళ్ళి చూసేసరికి ఎక్కువగా ఆయాస పడుతుండటంతో చాపర పిహెచ్సికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి108 ద్వారా టెక్కలి ఆసుపత్రికి తీసుకెళ్తూ ఉండగా మార్గమధ్యంలో మృతి చెందారని తెలుస్తుంది. మృతుడు అప్పన్న స్వగ్రామం ఎచ్చెర్ల, ఇతనికి భార్య వరలక్ష్మికుమారి, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతదేహాన్ని స్వగ్రామం ఎచ్చెర్లకు తరలించారు.